ఈ కథ ఎప్పటికీ ఇంతేనా!

'మోహనకృష్ణ'

ఎవరేనా సహనం గురించి మాట్లాడితే పావనమూర్తి చిన్న చిరునవ్వు నవ్వి ఎటో చూసేవాడు. ఇది అతనికి పుట్టుకతో వచ్చిన అలవాటు మాత్రం కాదు. జీవితం నిర్దాక్షిణ్యంగా అన్నివైపుల నుంచీ విపరీతమైన దెబ్బలు కొడుతూ, కుంగదీస్తున్నప్పుడు, తన లక్ష్యం ఎలాగో బతకడమేగాని చావడం కాదని అనిపించినప్పుడు, బాధ్యతలు మరింత బరువుని నెత్తిమీద మోపేసి 'బతకాలి బాబూ' అని హెచ్చరించినప్పుడూ ఆ చిరునవ్వు అతని పెదవులమీద స్థిర నివాసం ఏర్పరుచుకుంది. చేతి రేఖలకీ పుట్టుమచ్చలకీ, భాష్యకారులున్నట్లు, మనిషి కొన్ని కొన్ని పరిస్థితుల్లో విసిరే చిరునవ్వుకి అర్థం చెప్పగలిగేవాళ్ళుంటే 'భూదేవికే కాదు, సహనం గురించి నాకూ బాగా తెలుసు' అన్న భావం ఆ చిరునవ్వు వెనక తప్పకుండా కనిపిస్తుంది.

రాత్రి పదకొండు గంటలవేళ.

పావనమూర్తి దిద్దుతున్న కాంపోజిషన్ పుస్తకాలు కట్ట కట్టి పక్కకి తోసేసి, ఒళ్ళు విరుచుకుని, పెద్దగా ఆవలించేడు.

"ఇంకా పడుకోలేదూ?" అంటూ వచ్చింది సావిత్రమ్మ. లైటు వెలుగులో భార్య మొహాన్ని పరీక్షగా చూసేడు పావనమూర్తి. ఆవిడ మొహంలో గూడు కట్టుకున్న అలసట చూడగానే అతని గుండె బరువెక్కింది. భారంగా నిట్టూర్చేడు.

"ఈ కట్టలు దిద్దేదాకా నిద్రెలా పడుతుందే నాకు? ఇన్‌స్పెక్షన్ తోసుకుంటూ వచ్చేస్తోంది ఓ పక్కనుంచి!" అన్నాడు పావనమూర్తి.

సావిత్రమ్మ గట్టిగా నవ్వింది. నవ్వుతూనే గుమ్మంలో తలుపు కానుకుని కూర్చుంది.

"ఎందుకే నవ్వుతున్నావ్?" అని ప్రశ్నించేడు పావనమూర్తి.

"మధ్య మీరెప్పుడూ స్కూలూ, పాఠాలూ. కాంపోజిషన్లూ తప్ప మరో విషయం పట్టించుకోవడమే మానేశారు. ఇన్స్పెక్షను స్కూలుకీ, మీకే కాదు! మనందరి బతుకులకీ కూడా జరుగుతుంది నేడో రేపో!" అన్నది సావిత్రమ్మ గంభీరంగా.

పావనమూర్తి ఉలిక్కిపడ్డాడు.

"సావిత్రీ!" అన్నాడు దిగులుగా.

"అప్పుడే అలా అయిపోయారేవిఁటి? కథ యింకా నాందిలోనే వుంది." అన్నది సావిత్రమ్మ. పైటకొంగుచివర్ల నుంచీ వేలాడుతున్న దారపు పోగుల్ని లాగి, నోట్లో పెట్టుకుని చప్పరిస్తూ.

"ఏవిఁటా కథ?" అనడిగేడు పావనమూర్తి.

"అయ్యో రాత! ఇంత మతిమరుపేవిఁటండీ మీకు?" అన్నది సావిత్రమ్మ. భర్తలో ఆవిడకి నచ్చిన సుగుణాలు చాలా వున్నాయి. నచ్చనివి బహుకొద్ది. అంతమాత్రాన భర్తని విమర్శించడం, తీవ్రమైన పదజాలంతో వాదానికి దిగడం ఆవిడ తత్వానికి వ్యతిరేకం. ఎప్పుడైనా మరీ భరించలేని పరిస్థితుల్లో వ్యంగ్యంగా ఓ మాటంటేనే మొహం గంటుపెట్టుకుని లోలోపల బాధపడే భర్తని చూస్తుంటే జాలి కలిగేది. ఏ సంగతి గ్రహించగానే అలా అనడం కూడా తగ్గించేసింది. దానికి మరో కారణం కూడా వుంది. సంఘటన ఎంత తీవ్రమైనదైనా, సమస్య ఎంత క్లిష్టమైనదైనా తనకి సంబంధించనిదైనట్లు, తన నేమీ కదలించదన్నట్లు ప్రవర్తించి, వాటి పరిష్కారానికి అహోరాత్రాలూ తపించే పావనమూర్తి అంటే ఆవిడకి వల్లమాలిన ఆరాధన.

"అంత కుంగిపోవడానికి అసలు జరిగిందేమిటని?" అంటూ పావనమూర్తి, సావిత్రమ్మని ఆలోచనల్లోంచి బైటకు లాగేడు.

"అమ్మాయిని గురించి!" అన్నది సావిత్రమ్మ.

"అమ్మాయిని గురించా?" అని ఆశ్చర్యపడ్డాడు పావనమూర్తి. అతనిలో ఒక్కసారిగా లెక్కలేనన్ని ప్రశ్నలు.

సుభద్ర విషయంలో తను బాధ్యతని విస్మరించిందేమీలేదు. తొలిచూలు ఆడపిల్ల. ఆడపిల్లే కావాలని కలలు కన్నాడు. సావిత్రితో రోజుల తరబడి హోరాహోరి పోరాటం సాగించేడు, ఆడపిల్లని కనమని. కోరుకున్న బిడ్డని కనడం సావిత్రిచేతిలో పనే అన్నట్లు ఆమె నవ్వుతునేది కూడాను, తన అమాయకత్వానికి. చివరికి తన మాట చెల్లించింది సావిత్రి. మెరిసే కళ్ళతో కృతజ్ఞతలు చెప్పాడు. అంత అపురూపంగా పొందిన సుభద్రని అల్లారుముద్దుగా పెంచాడు. ఏ వయసులో ఏ ముచ్చట్లు జరగాలో, అవన్నీ

జరపించాడు. ఆమె కోరినట్లే కాలేజీలో ప్రవేశపెట్టాడు. డబ్బు ఇబ్బందులూ, అప్పులూ, వడ్డీలూ ఆమె దృష్టికి రాకుండా జాగ్రత్తపడి, కాలేజీ చదువు పూర్తి చేయించాడు. తన్నుతండ్రిగా తన బాధ్యతని యిప్పటిదాకా సక్రమంగా నిర్వర్తించాడు. మరి యిప్పుడు సావిత్రి-తనేదో మరచిపోయినట్లు ఎత్తిపొడవ డానికి కారణమేమిటో ఊహించలేక పోతున్నాడు.

"విషయమేమిటో స్పష్టంగా చెప్పు సావిత్రీ! ఈ మధ్య నువ్వన్నట్లు, చాలా విషయాల్లో నేను వెనకబడి పోతున్నానేమో అన్న అనుమానం నాకు వస్తోంది" అన్నాడు పావనమూర్తి, ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెడుతూ.

"అదేనండీ! అమ్మాయి పెళ్ళి విషయం!" అన్నది సావిత్రి!

"ఏమిటి?"

"ఏమిటేమిటి, నా మొహం. చదు వెందుకండీ ఆడపిల్లకి అంటే వినకండా డిగ్రీదాకా చదివించారు దాన్ని. మీ ముచ్చట నేనెందుకు కాదనాలని నోరు మూసుకు పడున్నాను. సరే అనుకున్న డిగ్రీ వచ్చింది. ఇకనన్నా దాన్నో యింటిదాన్ని చేసే ప్రయత్నాలు ప్రారంభిస్తారా, లేక మీ కాంపోజిషన్లు దిద్దుకోవడంతోనే సరిపెట్టుకుంటారా? చూడండి మాష్టారూ! కుర్రాడేదైనా తప్పు రాస్తే, ఎర్రసిరాతో కొట్టేసి, సరైనమాటేదో పక్కన రాస్తారు మీరు. కాని ఆడపిల్ల జీవితం కాంపోజిషన్ కాదు. ఇక్కడేదేనా పొరపాటు రాస్తే ఏ సిరాతోనూ కొట్టెయ్యనూలేం, సరైన మాటేదో రాసి చూపించనూలేం." అన్నది సావిత్రి.

పావనమూర్తి భార్య మొహంలోకి తీక్షణంగా చూశాడు. ఇప్పుడతనికి ఆవిడ మొహంలో అలసటకన్నా బాధ ఎక్కువగా కనిపిస్తోంది. అతని మనసులో ఏ మూలో ఏదో జరగకూడనిది జరిగి పోతోందేమో అన్న సందేహం చురుక్కున పొడిచింది. అతని ఒళ్ళంతా ఒక్కసారి కంపించింది. కుర్చీలోంచి లేచివెళ్ళి మంచంమీద వాలాడు.

"ఇలారా సావిత్రీ!" అన్నాడు.

సావిత్రమ్మ గుమ్మం దగ్గర్నుంచి లేచివెళ్ళి భర్త పక్కనే మంచంమీద కూర్చుంది.

"చూడు సావిత్రీ! నాతో పాతికేళ్ళ జీవితం పంచుకున్నావ్. ఏం సంపాదించానో, ఎలా సంపాదించానో, మిమ్మల్ని ఎంతవరకు సక్రమంగా, సంతృప్తి కరంగా చూసుకోగలిగానో నాకన్నా నీకే ఎక్కువ తెలుసు. అంతేగాదు! ఈ లోకాన్ని నాకన్నా నువ్వే ఎక్కువ అర్థంచేసుకున్నావ్. మొదట్నుంచీ, నన్నెలా నడిపిస్తూ వచ్చావో, ఇప్పుడు కూడా అలాగే నడిపించమని కోరడం



కన్న నేను చెయ్యగలిగిందేముంది, చెప్పు!" అన్నాడు.

"అంటే! పిల్లకి సంబంధం కూడా నన్నే వెతుక్కురమ్మంటారా, మహాశయా?" అన్నది సావిత్రి.

"తప్పేముంది? కన్నబిడ్డ పట్ల నాకొక్కడికేనా బాధ్యత? సగం నీకూ వుందిగా! నువ్వెలా చెబితే అలా చేస్తాను!" అన్నాడు పావనమూర్తి, ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

సావిత్రమ్మ క్షణకాలం భర్త మొహం లోకి కన్నార్పకుండా చూసింది.

"సుభద్ర యిప్పుడు చిన్నపిల్ల కాదండీ, మనం ఇద్దరం చెప్పినట్లు నడుచుకుందుకి. దానికీ వ్యక్తిత్వంవుంది. దాని జీవితం సౌఖ్యవంతం కావాలని కన్నవాళ్ళుగా మనం కోరుకోవడం సహజం. కాని....డిగ్రీ చదివినపిల్లగా దానికీ కొన్ని అభిప్రాయాలు వుంటాయి. వాటిని మనం జాగ్రత్తగా అర్థంచేసుకోవాలి." అన్నది.

పావనమూర్తికి కంగారు పుట్టింది.

"సావిత్రీ! అయితే సుభద్ర ఏదేనా నిర్ణయం తీసుకుంటున్నదా? నీతో ఏమైనా చెప్పిందా? నువ్వేమన్నావ్?" అని ఒక్కమాటుగా ప్రశ్నలు కురిపించేడు.

"అబ్బబ్బ! ఏమిటా కంగారు? ఏకబిగిని అన్ని ప్రశ్నలు వేస్తే ఎలా జవాబివ్వ గలననుకున్నారు? ఒకొక్కటీ అడగండి చెప్తాను. సరేగాని, హార్లిక్స్ కలుపుతాను. తాగుతారా?" అంటూ లేచింది సావిత్రమ్మ.

కావాలని జాప్యంచేస్తోందని అర్థమైంది పావనమూర్తికి. చెప్పకూడదని

కాదనాలి, సాధ్యమైనంతవరకు ఆందోళనని తగ్గించడానికి ప్రయత్నించడం ఆమె తత్త్వమని అతనికి తెలుసు. అందుకే ఆమె లేచి వెళుతుంటే అర్థం ఏరం చెప్పలేదు.

సావిత్రమ్మ వంటింట్లోకి వెళ్ళగానే పావనమూర్తి లేచి బైటికి వెళ్ళాడు. ముందు గదిలో లైటు వెలుగుతూనే వుంది. సుభద్ర మాత్రం మంచంమీద గాఢనిద్రలో వుంది. ఆమె గుండెల మీద ఓ ఇంగ్లీషు నవల.

"సుభద్రా!" అని పిల్చాడు పావనమూర్తి.

సుభద్రకి మెలకువ రాలేదు. పుస్తకం తీసి టేబిల్‌మీద పడేసి లైటు తీసేసి, ... ఓరగా వేసి, మళ్ళీ తన గదిలోకి వచ్చేశాడు. వాలుకుర్చీలో వాలేడు. ఇంతలో సావిత్రమ్మ స్టీలు గ్లాసుతో హార్లిక్స్ తెచ్చి భర్తకి అందించింది.

"నువ్వూ కాస్త తాగకూడదూ!" అన్నాడు పావనమూర్తి.

"తాగేనులెండి" అన్నది సావిత్రమ్మ.

పావనమూర్తి మౌనంగా గ్లాసు ఖాళీ చేసి పక్కన పెట్టేడు.

"ఏం పిల్లలో ఏమిటో! బొత్తిగా అర్థంగాకుండా పోతున్నారు ఈ రోజుల్లో! ఏమన్నా అంటే ప్రేమ అంటారు. ప్రేమించే ముందు స్థితిగతులూ, కుల గోత్రాలు చూసుకోవాలిగదరా అంటే ప్రేమకి ఆ భేదాలు వుండవని కొండవీటి చాంతాడంత ఉపన్యాసం చెబుతారు అక్కడికి ప్రేమ గురించి మనకేమీ తెలీనట్లు. నాకు తెలీకడుగుతాను మాష్టారూ, ఏ ప్రేమా లేకుండానే మనం యిన్నేళ్ళుగా ఈ నాలుగ్గోడల మధ్య దాంపత్యం సాగించామా! ఏమిటో, వెర్రి పిల్లలూ, వెర్రి మనసులూ!" అన్నది సావిత్రమ్మ.

పావనమూర్తి నిశ్శబ్దంగా వింటున్నాడు. తదేకంగా భార్య మొహంలోకే చూడసాగేడు. సావిత్రమ్మ బరువుగా నిట్టూర్చింది.

"ఈ పేళ నేను మీ స్నేహితుడు భాస్కరంగారింటికి వెళ్ళిపోతే ఈ సంగతి ఇంకెన్నాళ్ళు మనకి తెలీకుండా వుండేదో మరి. మీరు బలవంతంచేసి పంపడం మంచిదైంది. మన సుభద్రా-అదీనూ ఒకే రిక్షాలో వెళ్ళడం చూశాను. కనీసం టాపు కూడా వేయించుకోకుండా వెళుతున్నారు. ఎంత ధైర్యమండీ వాళ్ళకి!" అన్నది.

ఒక్కసారిగా పావనమూర్తి శరీరంలో రక్తమంతా ఉడికిపోయినట్లైంది. పరువుగా బతుకుతున్న ఏ తండ్రి అయినా పెళ్ళిగాని తన కూతురు ఓ మగాడి పక్కన రిక్షాలో షికార్లు చేస్తోందని విన్నప్పుడు- అటువంటి పరిస్థితికే రావాలి మరి

"చూసి ఎలా సహించావు సావిత్రీ!"

అని ప్రశ్నించాడతను కోపాన్ని దిగ మింగుకుని. సావిత్రమ్మ మంచంమీద కూర్చుంది. క్షణకాలం మౌనందాల్చింది.

"సహించక ఏం చెయ్యమంటారు? అప్పుడప్పుడు రిక్షా ఆపుచేసి ఈ చెంపా, ఆ చెంపా వాయగొట్టి ఇంటికి లాక్కురమ్మంటారా? కడుపు చించు కుంటే కాళ్ళమీద పడుతుందంటారు. నయం, నే నొక్కదాన్నే చూశాను. పక్కన మరెవరూ లేరు" అన్నది కొన్నిక్షణాల తరవాత.

"ఈ వేళంటె స్వయంగా చూశావు నువ్వు. గతంలో ఇంకెందరు చూశారో? మన ఎదట అనలేక చాటుమాటుగా ఎందరు చెవులు కొరుక్కుంటున్నారో మనకేంతెలుసే!"

"అవునా విషయమూ కొట్టిపారెయ్య డానికి వీల్లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆవేశపడి ప్రయోజనంలేదని మీకూ తెలుసు. జాగ్రత్తగా ఆలోచించి పిల్లని దారిలో పెట్టుకోవాలి!"

"ఇంతకీ ఆ కుర్రాడెవరో?"

"నాకు మాత్రం ఏం తెలుసు? ఇంత వరకూ దాని మనసేమిటో, ఆలోచన ఏమిటో ఎప్పుడేనా చెప్పింది గనకనా! కన్నతల్లిని, నా దగ్గరకూడా దాపరికమేనా దానికి?" అన్నది సావిత్రమ్మ గద్గది కంగా.

పావనమూర్తి కరిగిపోయేడు.

"ఎందుకే బాధపడతావ్? ఇప్పుడేం జరిగిందని? నువ్వు అధైర్యపడి కళ్ళ నీళ్ళు పెట్టుకుంటే నాకు కాళ్ళూచేతులూ ఆడవు. సుభద్రతో నేను మాట్లాడ తానుగా!" అన్నాడు.

"ఏం మాట్లాడతారో, ఎలా మాట్లాడ తారో ఏమిటో! నాకంతా అయోమ యంగావుంది. దాని మనసేమిటో ఆలో చనలేలాంటివో స్పష్టపడతే గాని, ఏ నిర్ణయం తీసుకోడానికీ వీల్లేని పరిస్థితి. పడుకోండి. బాగా పొద్దుపోయింది," అంటూ లేచింది సావిత్రమ్మ.

ఆ రాత్రి పావనమూర్తీ, సావిత్రమ్మ కంటిమీద కునుకులేకుండానే గడి పేశారు.

* * *

సాయంత్రం అయిదుగంటలు దాటు తోంది. పావనమూర్తీ, రమణారావూ స్కూల్లోంచి బైటపడి రోడ్డువారగా నడుస్తున్నారు.

"పావనం! సుభద్రకేవేనా సంబం ధాలు చూస్తున్నావా లేదా? ఎదిగిన పిల్లని ఎన్నాళ్ళట్టిపెట్టుకుంటావురా యింట్లో? ఏనాటికైనా పరాయింటికి పంపక తప్పదు గదా! ఎన్నాళ్ళు భరిస్తావురా గుండెల మీద కుంపటిని?"

"గుండెలమీద కుంపటా - ఏమిట్రా ఆ మాటలు! దాని తరవాత పుట్టిన మగ పిల్లలిద్దరూ తీరని అన్యాయం చేసి పోయారు. అల్పాయుష్కులు. ఇక మిగిలింది సుభద్రేగా! అది నాకు భారం

కాదురా!" అన్నాడు పావనమూర్తి. రమణారావు సంభాషణ ఎక్కడికి దారి తీస్తుందో అతనికి అర్థంగాకపోలేదు. అయినా బింకం సడలకుండా గబ గబ అనేశాడు.

"ఛ ఛ! నా వుద్దేశ్యం నీకు భారమని కాదు. దాన్తో యింటిదాన్ని చేసే బాధ్యత తని గుర్తుచేస్తున్నాను. అంతే."

"మర్చిపోతే గదా నువ్వు గుర్తు చెయ్యడానికి!"

"నిజమే! కాని పరిస్థితులు విషమించకముందే బాధ్యత నిర్వర్తించడం మంచిదని!"

"రమణా!" అన్నాడు పావనమూర్తి రవ్వంత ఆవేశంగా.

రమణారావు చప్పున పావనమూర్తి చెయ్యి అందుకున్నాడు.

"పావనం! నన్ను క్షమించు. నీ మీద, స్నేహితుడిగా నాకున్న అభిమానం కొద్దీ చెబుతున్నాను. ఈ మధ్య మన సుభద్రా, ఎమ్మెల్యేకొడుకూ కలిసి తిరగడం చూశాన్నేను." అన్నాడు.

పావనమూర్తి గుండె పగిలిపోతోంది. ఈ వార్త తనదాకా రాకముందు చాలా చోట్ల వ్యాపించింది. తను మాత్రం కళ్ళుమూసుకుని కూర్చున్నాడు. మొట్టమొదటిసారిగా తనమీద తనకే అసహ్యం వేసింది పావనమూర్తికి.

"మన బిడ్డలమీద మనకి ప్రేమాభిమానా లుండాలి. నమ్మకం ఉండాలి. కాదన్ను. కాని వాటినన్నింటినీ వాళ్ళు, మన చాతగానితనంగా భావించి, మన పరువుప్రతిష్ఠలతో ఆడుకోవడం సహించకూడదేమో!" అన్నాడు, రమణారావు.

"అవును నిజం! సహించకూడదు. సహించను." అన్నాడు పావనమూర్తి చాలా కఠినంగా.

పావనమూర్తి ఆవేశం చూసి, అంతకంటె వివరాలు చెప్పడానికి గాని, సలహాలివ్వడానికి గాని సాహసించలేకపోయేడు రమణారావు. ఇద్దరూ కొంతదూరం నడిచి ఎవరిమార్గానికి వాళ్ళు విడిపోయేరు.

పావనమూర్తి యింట్లో కాలుపెట్టేసరికి లోపల్నుంచి సావిత్రమ్మ కంఠం కొంచెం గట్టిగానే వినపిస్తోంది. అంత గట్టిగా కాకపోయినా, నేనూ వున్నాను సుమా అన్నట్లు సుభద్ర గొంతుకూడా వినవస్తోంది. పావనమూర్తి తల్లీకూతుళ్ళ వాగ్వివాదంలో వెంటనే కలగజేసుకోవడానికి సాహసించలేక, గదిలోకి నడిచేడు. బట్టలు విప్పి వంకెకి తగిలించి లుంగీ చుట్టుకున్నాడు. మౌనంగా పెరట్లోకి వెళ్ళి ముఖప్రక్షాళనం పూర్తిచేసి మళ్ళీ లోపలికి వచ్చేడు. ఓసారి వంటింటివైపు చూసి, "సుభద్రా!" అని కేకేశాడు, సాధ్యమైనంత సౌమ్యతని పిలుపులో పొదిగి.

"వస్తున్నా నాన్నా!" అంటూ సుభద్ర వచ్చింది.

పావనమూర్తి కూతురివైపు తేరిపార జూసేడు. ఆమె కళ్ళు ఎర్రగా వున్నాయి.

ఆమె బాగా ఏడ్చివుంటుదన్న విషయం అతనికి అర్ధమైంది.

"ఎందుకమ్మా, ఆ పిచ్చిదానితో వాగ్యుద్ధం? ఈ మధ్య మీ అమ్మకి చాదస్తం మరీ ఎక్కువవుతోంది! రాత్రంతా నీ భవిష్యత్తు గురించి లేని పోని అనుమానాలన్నీ నా ముందు వెళ్ళ బోసి నా ప్రాణంతీసింది." అన్నాడు పావనమూర్తి పెదవులమీదికి చిరునవ్వు తెచ్చుకుని.

సుభద్ర తలవంచింది. ఆమె కళ్ళ ల్లోంచి అశ్రువులు చెక్కిళ్ళమీదికి జారు తున్నాయి.

"నువ్వెళ్ళి గదిలో కూర్చోమ్మా! తరవాత నేవచ్చి మాట్లాడతాను. అమ్మని నేను మందలిస్తాన్లే, ఊరుకో!" అన్నాడు పావనమూర్తి. సుభద్ర పైటకొంగుతో కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది. పావనమూర్తి బరువుగా వంటగదిలోకి నడిచాడు. సావిత్రమ్మ పీట వాల్చింది. అతను కూర్చున్నాడు. పకోడీల ప్లేటు అతని ముందుకి తోసిందావిడ.

"నేను పిచ్చిదాన్నంటారా మాష్టారూ? నాకు చాదస్తంకూడా ఎక్కువైపోయిం దంటారా? ఇన్ని నిజాలు ఎప్పుడు కని పెట్టారండీ, నాకు తెలీకుండా?" అన్నది సావిత్రమ్మ.

పావనమూర్తి ఓసారి ఆమె మొహం లోకి చూసి తలవంచుకుని పకోడీలు తినసాగేడు.

"ఎలా వున్నాయో చెప్పకుండా తింటు న్నారేవిటి? కొత్త అలవాట్లు నేర్చు కుంటున్నారా?" అన్నదావిడ. కుంపటి వేడికి మొహంమీద కమ్మిన స్వేదబిందు వుల్ని పైటకొంగుతో తుడుచుకుంటూ.

పావనమూర్తి మాట్లాడలేదు. రెండు క్షణాలు జవాబుకోసం ఎదురుచూసి, "ఇవ్వాళ, నిజం చెప్పాలంటే సరిగా కుదర్లేదులెండి. మనసునిబట్టే వుంటుంది రుచికూడా!" అన్నది సావిత్రమ్మ.

"అవును. రుచులనేవి మనసునిబట్టే!" అన్నాడు పావనమూర్తి తలెత్తకుండానే.

"అలాని గంజినీళ్ళకి గతిలేనివాడు, గులాబ్‌జాంని గురించి కలలుకంటూ గిన్నె తన్నేసుకుంటే ఏం లాభిస్తుం దండీ? మబ్బుల్లో నీరుచూసి చెంబులో నీరు పారబోసుకున్నట్లు?" అన్నది సావిత్రమ్మ.

"అంత తెలివితక్కువ పని చెయ్య మని ఎవరంటారు సావిత్రీ, అంతా నీ పిచ్చిగాని?" అన్నాడు పావనమూర్తి.

"ఎవరూ చెప్పరు గదా! ఆ మాటే నేనూ సుభద్రకి చెప్పాను. ఆ మాటకే దానికి పౌరుషం పొడుచుకొచ్చింది. మన పరువుప్రతిష్ఠలను గంగపాలుచేసే పనికి తనేమీ ఒడిగట్టలేదని వాదిస్తోంది. పెళ్ళికాకుండా ఓ పరాయి మగాడితో రిక్షాలో తిరగడం పరువుని పెంచేపనం టావా అని అడిగాను. అంతే! తన ఘనకార్యం మనదాకా వచ్చేసిందన్న

ఉడుకు మోత్తనమో ఏమిటో, ఏడుస్తుంది. ఆ మాత్రం మాటనడం చాద స్తం అనేగా మీ అభిప్రాయం ?" అన్నది సావిత్రమ్మ చురుగ్గా.

"నే నన్నది నీకు సరిగ్గా అర్థంగాలేదు సావిత్రీ !"

సావిత్రమ్మ భర్త చెప్పబోయే సంజ్ఞాయిషీకి గట్టిగా నవ్వింది.

"అర్థమైంది మాష్టారూ! పూర్తిగా అర్థమైంది. కాని మీరు తెలుసుకోవలసిం దేమిటంటే చిలక్కి చెప్పినట్లు చెప్పే పరిస్థితి కాధండీ యిది కొంచెం కరుగ్గా వుంటే తప్ప వీల్లేమా అని!" అన్నది.

పావనమూర్తి సగం పకోడీలతో ప్లేటుని అవతలికి జరిపేశాడు. ఇన్ని కాఫీనీళ్ళు గొంతులో పోసుకుని, మూతి తుడుచుకుంటూ సరాసరి కూతురి గదిలోకి వెళ్ళేడు.

సుభద్ర కిటికీవార నిలబడి బైటికి చూస్తోంది.

పావనమూర్తి మంచంమీద కూర్చుని, పక్కన పడున్న మేగజైన్ చేతిలోకి తీసుకుని పేజీలు తిరగేస్తూ, "ఇవ్వాళ రమణారావుకూడా నాతో అన్నాడమ్మా! నీ మీద అసూయతో లేనిపోనివేవో కల్పించి చెప్పాడేమో అనుకోడానికి వీల్లేకుండా రాత్రే మీ అమ్మ కళ్ళతో చూసేనని చెప్పింది. పోనీ రమణారావుకి అసూయ అనుకున్నా, మీ అమ్మకి అలాంటి భావం వుండటానికి ఆస్కారం లేదనుకుంటాను !" అన్నాడు.

సుభద్ర వెక్కి వెక్కి ఏడుస్తోంది.

పావనమూర్తి హృదయం కరిగి కన్నీరైపోతోంది. కూతురి తలను గుండెలకి హత్తుకుని ఓదార్చాలని పించింది. కాని కూర్చున్న చోట్నుంచి అరంగుళం కూడా కదల్లేకపోయాడు.

"రాజు చాలా మంచివాడు నాన్నా !" అన్నది సుభద్ర కొన్ని క్షణాల తరవాత వెక్కిళ్ళమధ్య.

"నీ నమ్మకాన్ని గానీ, నీ కతని మీదున్న ప్రేమాభిమానాలను గాని కాద నాలని లేదు సుభద్రా నాకు. ప్రేమిం చడం, ప్రేమింపబడటం స్త్రీ పురుషుల జన్మహక్కు. కాని నువ్వు చాలా మంచి వాడని కితాబిస్తున్న ఆ రాజు మహారాజు కుమారుడు! అతనికి సింహాసనాలూ కిరీ టాలూ లేకపోవచ్చు. లక్షాధికారి, ఎమ్మెల్యే గారి ఏకైక పుత్రుడు అనే భుజకీర్తు లున్నాయి. అలా పొగుడుతూ అతనిలో లేని అహంకారాన్ని, ఐశ్వర్యమదాన్నీ రెచ్చగొట్టే వందిమాగధులు దేశంనిండా లక్షోపలక్షలున్నారు. ఈ వైకుంఠపాళిలో పాములబారి పడకుండా, నిచ్చెనలెక్కి ఆ పరమపదం చేరే అవకాశం మనలాంటి వాళ్ళకి ఉండదు తల్లీ అని చెప్తున్నాను. చేరగలనన్న నమ్మకం నీకుండొచ్చు. కాని, ఆ నమ్మకాన్ని వాస్తవంగా మార్చ డానికి తగిన ఆర్థికపునాది నీ కివ్వగలి గిన స్తోమతు నీ కన్నతండ్రికి లేదని చెప్పడమే నా అభిమతం !" అన్నాడు



పావనమూర్తి. చివరి మాటలు సాధ్యమైనంత నొక్కి నొక్కి చెప్పాడు.

"రాజుకి ఆ భేదాలు లేవు నాన్నా! మన పరిస్థితులు అతనికి పూర్తిగా తెలుసు," అన్నది సుభద్ర చాలా దృఢంగా.

పావనమూర్తి నవ్వేడు.

ఎప్పుడో ఏదో సినిమాలో విన్నాడో, ఏ నవలలోనైనా చదివాడో అతనికి గుర్తులేదు సరిగ్గా. యివే మాటలు కాకపోయినా, యిలాంటివే గుర్తొచ్చేయి.

"సుభద్రా! ఆ రాజుకి లేకపోవచ్చు. కాని రాజు తండ్రి రాజులాంటివాడూ, రాజులాంటి మంచివాడు కావాలనిలేదుగా! అప్పుడీ సమస్యకి పరిష్కారం ఎలాగో ఆలోచించావా!"

సుభద్ర వెంటనే జవాబు చెప్పలేకపోయింది.

"వాస్తవం కలలంత అందంగానూ, మంత్రుల పర్యటనకోసం ప్రత్యేకంగా వేసిన తార్రోడ్డులా నిరాటంకంగానూ ఉండదు సుభద్రా! అసలు మనలాంటి వాళ్ళ జీవితాలు గోతులతోనూ, ముళ్ళ కంచెలతోనూ నిండివుంటాయి. అందుకే మీ అమ్మా నేనూ నీ భవిష్యత్తు గురించి ఇంతగా బెంగపడుతున్నాం. ఒక్క ప్రశ్న అడగమంటావా తల్లీ" అన్నాడు పావనమూర్తి.

"అడగండి నాన్నా!" అన్నది సుభద్ర.

అడగబోయి ఆగిపోయేడు పావనమూర్తి. కొన్ని నిముషాలపాటు [illegible]

మీదే కూర్చుండిపోయాడు అడగకూడదన్న నిర్ణయానికి వచ్చి "వద్దులే సుభద్రా! వద్దులే!" అంటూ లేచి గది బైటికి నడిచేడు. సుభద్ర చప్పున తండ్రికి అడ్డుగా వచ్చింది.

"మీ రడక్కపోయినా ఆ ప్రశ్న నాకు తెలుసు నాన్నా!" అంటూ తండ్రి వక్షస్థలంమీద తలవాల్చి బావురుమన్నది సుభద్ర.

పావనమూర్తికి దుఃఖం పెల్లుబికింది.

"ఏడవకు సుభద్రా! ఈ సమస్యకి పరిష్కారం వెతుకుతాను. కన్న తండ్రిగా ఈ పాటి చెయ్యగలను" అని, కూతురి తలనిమిరి బైటకి నడిచేడు. గుమ్మంపక్కనే నిలబడివున్న సావిత్రమ్మవైపు ఓసారి చూసి తల దించుకుని నడిచిపోయేడు వీధిలోకి.

సావిత్రమ్మ భర్త వెళ్ళినవైపు సజల నేత్రాలతో చూస్తూ వీధిగుమ్మంలో నిలబడిపోయింది. కూతురి గదిలోంచి వెక్కిళ్ళు ఆవిడ చెవుల్లో ప్రతిధ్వనిస్తూనేవున్నాయి.

* * *

సంఘంలో ప్రతిదీ వ్యాపారంగా మారిపోయింది. ప్రతి వస్తువునూ–ఆఖరికి రక్తమాంసాలతో, ప్రాణంతో వున్న శరీరాన్నికూడా అమ్ముకోవచ్చు. ఓపిక వున్నవాడూ, అవసరం వున్నవాడూ కొనుక్కోవచ్చు. అమ్మడం ముందుపుట్టిందో కొనడం ముందుపుట్టిందో చెప్పలేం, విలదీసి ప్రశ్నిస్తే, విత్తుముందా, చెట్టుముందా అన్న ప్రశ్నకి ఏ జవాబొస్తుందో, అదే జవాబు వస్తుంది. ప్రజాస్వామ్యంలో ఓట్లు, కులాలు, మతాలు, కులసంఘాలు అన్నీ కొనడానికి దొరుకుతాయి.. అమ్మకానికి సిద్ధంగా వుంటాయి. అలాగే పెళ్ళిళ్ళకి.... పెళ్ళికొడుకులు కూడా వివిధ రేట్లలో దొరుకుతున్నారు. డబ్బుకి విలువ పెరిగి, మానవులమధ్య పరస్పర సంబంధాలకీ, అనుబంధాలకీ విలువలు పడిపోయినప్పుడు– జరిగేది వ్యాపారం తప్ప మరేమీ కాదనుకోవడంలో ఆశ్చర్యం లేదు! అసహజమూ వుండదు.

ఎమ్మెల్యే రావుగారు భూస్వామిగా, వ్యాపారస్తుడిగా వుంటూ వున్నప్పుడు కొడుకు రాజురేటు ఒకరకంగా వుండేది. ఆయన ఎమ్మెల్యే అయ్యాక ఆ రేటులో 'సహజంగా' అభివృద్ధి వచ్చింది. పెద్ద భూస్వాములతోనో, వ్యాపారవేత్తలతోనో సంబంధం కలుపుకోవాలన్న ఆలోచన మరో మెట్టు పైకెక్కి, ఇప్పుడు భూస్వామీ + వ్యాపారవేత్త + రాజకీయ నాయకుడితోనో, లేక మంత్రులతోనో సంబంధాలు కలుపుకోవడం మీదికి మళ్ళింది. ఈ మలుపు అనేక విధాలుగా అభివృద్ధికి దోహదకారి అన్న సత్యం ఆయనకి పూర్తిగా అర్థమైంది.

ఆ స్థితిలో – ఎదురుగా కూర్చున్న, తన కూతుర్ని – రాజుకి చేసుకోమని

అడగవచ్చిన మాష్టారు పావనమూర్తి ఎమ్మెల్యే రావుగారికి చెల్లని సత్తుపావలా కాసులా కనిపించాడు.

పావనమూర్తికి కూడా తెలుసు, తనెంత సాహసం చేస్తున్నాడో, ఎంత దురాశకి లోనవుతున్నాడో! కాని అతను సరిపెట్టుకున్నాడు. ఈ ప్రయత్నం తనకోసం కాదు. తన బిడ్డకోసం.

"మాష్టారూ! మీరు చెప్పదల్చుకున్నదంతా చెప్పేశారా? ఇంకేమైనా మిగిలిందా?" అనడిగేరు ఎమ్మెల్యే రావుగారు.

"ఇంకేం చెప్పమంటారు సార్! చెప్పవలసిందంతా చెప్పాను. ఇక అడుకోవలసిందీ, నా పరువుప్రతిష్ఠల్ని నిలబెట్టవలసిందీ మీరు!" అన్నాడు పావనమూర్తి వినయంగా.

ఎమ్మెల్యే రావుగారు నవ్వారు. ఆయన నవ్వు ఆ నాలుగు గోడలమధ్య ప్రతిధ్వనించింది. తెల్లబోయి ఆయన వైపే చూస్తూ వుండిపోయాడు పావనమూర్తి.

"మీ రింతసేపూ మీ పరువుప్రతిష్ఠల గురించి చాలా చెప్పుకుంటూ వచ్చారు. నేను చాలా ఓపిగ్గా విన్నాను. కాని మీరు

తెలుసుకోలేనిది ఒకటుంది. మా వెధవ తెలివితక్కువగా మీ అమ్మాయిచుట్టూ తిరిగి తన అంతస్తుని ఎంత దిగజార్చు కున్నాడో, నా ప్రతిష్ఠకి ఎంత భంగం కలిగించాడో అర్థంచేసుకోలేకపోతున్నారు. సరే! ఒక్క విషయం చెప్తాను వినండి! మీ అమ్మాయిని మా వాడికి చేసుకుంటే మీ రేపాటి కర్చు పెట్టగలరు? నుంచున్న పళాన మా రాజుకి యాభై వేలిస్తామని వస్తున్నారు." అన్నారు రావుగారు చాలా తాపీగా.

పావనమూర్తికి నోట మాటరాలేదు.

"అయినా నాకు తెలీకడుగుతాను మాష్టారూ! మీ అమ్మాయికి చిన్నప్పట్నించీ ఏ యింటి పరిస్థితులేవిటో తెలియజెప్పలేదటండీ! అంతస్తులు తెలుసుకుని ఆశలు పెంచుకోవాలన్న సంస్కార భావాన్ని ఎందుకు కలిగించలేకపోయారు?" అన్నారు మళ్ళీ రావుగారు.

పావనమూర్తిలో వుద్రేకం గుండె గోడల్ని తన్నుకుని పైకొస్తోంది. కాని గట్టిగా ఎదిరించి మాట్లాడటానికీ, ఆయన అన్నదానిని కొట్టిపారెయ్యడానికి వీల్లేదు. ఇప్పుడాయన మగపిల్లవాడి తండ్రి, పైగా పెద్ద పలుకుబడి గలవాడు. అన్నింటినీ మించి బాగా డబున్నవాడు.

"పోనీ అవన్నీ వదిలెయ్యండి. వాటిని ఎలాగోలా సరిపెట్టుకుందామన్నా, కనీసం మన కులంకూడా ఒకటికాదే!" అన్నారు రావుగారు.

పావనమూర్తి కుంగిపోయాడు. ఇంక తను ఏరకంగానూ ఆయన్ని ఒప్పించ లేడు.

"క్లాసులో కూచుని, నీతులు వల్లించినంతమాత్రాన, సంఘంలో పూర్తిగా మార్పొచ్చేస్తుందని ఆశించడం ఆరోగ్యదాయకంకాదు మాష్టారూ! అంత తేలిగ్గా సంఘం మారదు." అన్నారు రావుగారే మళ్ళీ.

"నిజమే రావుగారూ! మీరు చెప్పింది పూర్తిగా నిజం. పొరపాటు నాదే! సంఘంలో వేళ్ళు తన్నుకున్న కుల తత్వాలూ, వర్గభేదాలూ, వరకట్నంలాంటి దురాచారాలూ పోగొట్టడానికి మన తరం వాళ్ళు నడుంకట్టకపోయినా, కనీసం పైతరం వాళ్ళయినా పూనుకుంటారన్న ఆశకొద్దీ పసిమనస్సుల్లో ఆదర్శాలు పొదగడానికి ప్రయత్నిస్తున్నాం. కాని, మీలాంటి మహానాయకులు ద్వంద్వ స్వభావాలతో వుంటున్నంతకాలం ఆ ఆశ తీరదని కానుకోలేకపోతున్నాం. వేదికల మీద మీరు చెప్పే ఉపన్యాసాలకీ, ఆచరణలో మీరు చేస్తున్న పనులకీ పొంతన లేనట్లే, తరగతి గదుల్లో మేంచెప్పే నీతులకీ, బైటికి వచ్చాక పిల్లవాడి చుట్టూ వుండే వాతావరణానికీ సంబంధంలేదు. ఏ నీతులైనా, బోధలైనా మార్పుకి దోహదం చెయ్యడం అసంభవం.

..ఏవ



ఇలాంటి అస్తవ్యస్త పరిస్థితుల్లో మనిషి మనిషిగా గౌరవింపబడడం గానీ, మనస్సులోని పవిత్రమైన ఆలోచనలకి విలువగానీ వుండవు." అన్నాడు పావనమూర్తి, రాని చిరునవ్వుని పెదవుల మీదికి తెచ్చుకుని.

రావుగారి మొహం జేవురించింది. ఆయనేదో అనాలని ప్రయత్నిస్తూండగానే, ఆయన సుపుత్రుడు రాజు గబ-గబ లోపలికి వచ్చేడు. నరాసరి మేడ మీదికి వెళుతున్నవాడల్లా తండ్రితో మాట్లాడుతున్న కొత్తవ్యక్తిని చూసి ఆగేడు.

"రాజు బాబూ! వీరు పావనమూర్తి మాష్టార్రా! తన కూతుర్ని నీకివ్వాలని వచ్చారు! ఆ పిల్ల నీ మీద మనసు పడిందటగా?" అన్నాడు రావుగారు.

రాజు గట్టిగా నవ్వేడు. ఆ నవ్వు అచ్చుగ్రుద్దినట్లు రావుగారి నవ్వే. నాలుగు గోడల మధ్య ప్రతిధ్వనించింది.

"ఆ అమ్మాయి నీతో చాలా స్నేహంగా తిరిగిందిట?" అని ప్రశ్నించేరు రావుగారు.

"నాతో తిరిగిన ప్రతి ఆడపిల్లని పెళ్ళిచేసుకోడానికి ఎలా సాధ్యమవుతుంది నాన్నా! అలా చేసుకోవాలంటే కనీసం దసనుమందికైనా తాళికట్టాలి. నా వల్లకాదు. నేనేవీ(శ్రీకృష్ణపరమాత్మని కాదుమరి. ఆ విషయం మాష్టారికి స్పష్టంగా చెప్పండి!" అంటూ మెట్లెక్కి-పైకి వెళ్ళిపోయాడు ప్రిన్స్, చార్మింగ్, డాళింగ్ అఫ్ ద సిటీ!

రావుగార్ని ఎదిరించి, ప్రేమకోసం గట్టిగా నిలబడే ఆదర్శ యువకుడేమో

అతనని ఏమూలో అశ పెంచుకున్న పావనమూర్తి పాతాళానికి పడిపోయాడు. చప్పున లేచి నిలబడి, గుమ్మంవైపు కదిలాడు.

"గొప్ప జోకులు వేస్తావురా రాజూ నువ్వు!" అని కొడుకుని మెచ్చుకుంటున్న రావుగారి గొంతు పావనమూర్తి చెవుల్లో సీసం కరిగించి పోసినట్లు ధ్వనించింది.

జీవంలేని శిధిలశిల్పంలా రోడ్డుమీద నడుస్తున్నాడు. కళ్ళు వర్షిస్తున్నాయి. హృదయం రోదిస్తోంది. ప్రపంచం పరిహసిస్తోంది. కాని ఆయన పెదవుల మీద చిరునవ్వు అలాగే వుంది.

గుమ్మంలో కాలుపెట్టిన పావనమూర్తికి సుభద్ర ఆశగా ఎదురొచ్చింది.

"అమ్మా సుభద్రా! నిస్వార్థంగా పంచియిచ్చే నీ వంటి ఆడపిల్ల ప్రేమని పొందే అర్హత రాజులాంటి వాళ్ళకి లేదమ్మా! వాళ్ళు అపాత్రులు! అంతే!" అన్నాడు పావనమూర్తి.

సావిత్రమ్మ కూతుర్ని గుండెల్లో పొదువుకుని మౌనంగా కన్నీరు కారుస్తోంది.

"ఈ పరిస్థితుల్లో నేను వెదికితెచ్చిన వాణ్ణి చేసుకోమని అడగలేను. నాకు మగపిల్లలు లేనేలేరు. నేటినుంచి ఆ స్థానం నీదేనమ్మా. ఈ కుటుంబభారాన్ని కొంత భరించడానికి ప్రయత్నించు. ఆ పైన మన అదృష్టం ఎలా వుంటే అలా జరుగుతుంది." అన్నాడు పావనమూర్తి.

చేతిరేఖలకీ, పుట్టుమచ్చలకీ భాష్యకారులున్నట్లు, మనిషి కొన్ని కొన్ని పరిస్థితుల్లో విసిరే చిరునవ్వుకి అర్థం చెప్పగలిగేవాళ్ళుంటే, 'భూదేవికే కాదు, సహనం గురించి నాకూ బాగా తెలుసు' అన్నభావం ఆ చిరునవ్వు వెనుక తప్పకుండా కనిపిస్తుంది.